


నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

ఆదిలాబాద్

మంచిర్యాల
నిర్మల్ - కొమరం భీం
ఆసిఫాబాద్

ఆదివారం 22 ఫిబ్రవరి 2026 పేజీలు 06


### పదో తరగతి విద్యార్థుల

## భవిష్యత్తే కీలకం

### -- జిల్లా కలెక్టర్ రాజర్షిషా



**ఆదిలాబాద్ టౌన్,మేజర్ సూర్య న్యూస్:**

పదో తరగతి విద్యార్థుల భవిష్యత్తు ఎంతో కీలకమైనదని,విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా కోరారు. కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి జిల్లాలోని పదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రులతో శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పరీక్షల సన్నద్ధతపై దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు విద్యార్థుల కోసం పాఠశాలల్లో ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే విద్యార్థులకు ప్రొటీన్ స్నాక్స్ కూడా అందిస్తున్నామని తెలిపారు. ఐఎఫ్పీ ప్యానెల్స్, ఖాన్ అకాడమీ వంటి ఆధునిక పద్ధతుల ద్వారా బోధన సాగుతోందని అన్నారు. విద్యార్థులు ప్రతిరోజూ పాఠశాలకు వెళ్లేలా చూడాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ గైర్హాజరు కాకుండా పర్యవేక్షించాలని తల్లిదండ్రులకు సూచించారు. చదువుతో పాటు ప్రతిరోజు యోగా, ధ్యానం, వ్యాయామాలు చేయించాలన్నారు. తల్లిదండ్రులు పాఠశాల ఉపాధ్యాయులను కలిసి తమ పిల్లల ప్రగతిని అడిగి తెలుసుకోవాలని, చదువులో వెనుకబడి ఉంటే ప్రత్యేక శ్రద్ధ తీసుకునేలా చూడాలన్నారు. జిల్లా యంత్రాంగం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సమన్వయంతో పనిచేసి పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో ఈసీఈడీ సెక్రటరీ గజేందర్, సెక్టోరల్ అధికారులు రఘురమణ, తిరుపతి, సాంకేతిక సిబ్బంది విలాస్, ఇతర అధికారులు, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



### చింతలమానేపల్లిలో టేకు దుంగల

## అక్రమ తరలింపు కలకలం

### డిప్యూటీ రేంజ్ అధికారిపై కేసు నమోదు

### -- దుంగల స్వాధీనం



2లో

### జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులను

## వేగవంతం చేయాలి

- పూర్తి అయిన పనుల బిల్లుల ప్రతిపాదనలు సమర్పించాలి
- నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుంది
- అంగన్ వాడిలలో మూత్రశాలల నిర్మాణాలు, మౌళిక వసతుల కల్పన పనులను త్వరగా పూర్తి చేయాలి
- పి ఎం జుగా క్రింద అంగన్వాడి కేంద్రాలకు పి వి టి జి ఆవాసాలకు విద్యుత్ సౌకర్యం కల్పించాలి
- జిల్లా కలెక్టర్ కె.హరిత

**ఆసిఫాబాద్ ప్రతినిధి,సూర్య మేజర్ న్యూస్ :**

జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారితో కలిసి జిల్లా అధికారులు, పంచాయతీ రాజ్, రహదారి భవనాల శాఖ, గిరిజన సంక్షేమ శాఖ ఇంజినిరింగ్ అధికారులు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, హౌసింగ్ శాఖ ఇంజినీరింగ్ అధికారులు, గ్రామీణ ఉపాధి హామీ అధికారులు, మహిళ





శిశు సంక్షేమ శాఖ అధికారులు, మండల విద్యా శాఖ అధికారులతో జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులు, ఇందిరమ్మ ఇండ్ల పనుల పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరం మార్చి 31వ తేదీతో ముగియనున్నందున పనులను వేగవంతం చేసి పూర్తి అయిన పనుల బిల్లుల ప్రతిపాదనలు సమర్పించాలని తెలిపారు. సంబంధిత అధికారులు, ఇంజినీరింగ్ అధికారులు, ఎం పి డి ఓ లు, సమన్వయంతో పని చేయాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం క్రింద మంజురైన గ్రామ పంచాయితీ కార్యాలయ భవనాలు, గ్రామ సమైఖ్య భవనాలు, ఫుడ్ గ్రెయిన్స్ గోదాం, వంటశాలల నిర్మాణాల పనులను వెంటనే ప్రారంబించి మార్చి మాసాంతం లోగా పనులను పూర్తి చేయాలని తెలిపారు. అంగన్ వాడిలలో మూత్రశాలల నిర్మాణాలు, మౌళిక వసతుల కల్పన పనులను త్వరగా పూర్తి చేయాలని, ఇంజినీరింగ్ విభాగాల ఆధ్వర్యంలో చేపట్టిన పాఠశాలల అదనపు తరగతి గదులు, రహదారి పనులు, వంతెనలు, కల్వర్టుల నిర్మాణాలు, బి. టి. రహదారుల నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. సంపూర్ణత అభియాన్ క్రింద (ప్రధాన మంత్రి) జన మన్, పి ఎం జుగా క్రింద చేపట్టిన పనులను పూర్తి చేయాలని, పి ఎం జుగా క్రింద అంగన్వాడి కేంద్రాలకు పి వి టి జి ఆవాసాలకు విద్యుత్ సౌకర్యం కల్పించాలని, పాఠశాలలలో బాలికలకు ప్రత్యేక మరుగుదొడ్ల పనులు త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. వేసవిలో త్రాగునీటికి ఇబ్బంది లేకుండా ముందస్తు ప్రణాళిక రూపొందించుకోవాలని, అవసరమైన మరమ్మతు చర్యలు చేపట్టాలని తెలిపారు. లింగాపూర్, సిర్పూర్ (యూ), తిర్యాణి మండలంలోని మారుమూల గిరిజన గ్రామాలకు త్రాగునీటికి ఇబ్బందులు లేకుండా గ్రామీణ నీటి సరఫరా శాఖ, ఇంజినీరింగ్ అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేయాలని, ఇందిరమ్మ ఇండ్ల పనుల



పురోగతి సాధించాలని, ఇంకా ప్రారంభం కాని ఇండ్ల పనులను లబ్దిదారులతో మాట్లాడి త్వరగా ప్రారంభించాలని తెలిపారు. 15వ ఆర్థిక ప్రణాళిక క్రింద చేపట్టిన పనులను మార్చి 31 లోగా పూర్తి చేసి బిల్లులు చెల్లించాలని తెలిపారు. అనంతరం మండలాల వారీగా చేపట్టిన పనుల పురోగతి పై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్ అధికారులు, జిల్లా అధికారులు,ఎంపి డి ఓ లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### చికిత్స కంటే

## నివారణ నే మేలు

### -హృద్రోగా నిపుణులు డాక్టర్ శ్రీకాంత్



**మంచిర్యాల టౌన్,ఫిబ్రవరి 21, సూర్య మేజర్ న్యూస్ :**మంచిర్యాల ఒక ప్రైవేట్ హాల్ లో సికింద్రాబాద్ యశోద హాస్పిటల్ సీనియర్ కార్డియలోజిస్ట్ డాక్టర్ శ్రీకాంత్ ఆధ్వర్యంలో శనివారం గుండె ఆరోగ్య పరిరక్షణ పై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీకాంత్ మాట్లాడుతూ ప్రతి మనిషి తన ఆరోగ్యం కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. చికత్స కంటే అనారోగ్య నివారణకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.గుండె ఆరోగ్యం కాపాడుకోవడం చాలా ముఖ్యం అన్నారు.మనిషి శరీరం లో గుండె పాత్ర కీలకమైంది అన్నారు.హృదయనాళ వ్యవస్థ అధ్యయనం చేసి దానికి తగ్గట్టు చికత్స చేపించుకోవాలన్నారు. గుండెపోటు, గుండె వైఫల్యం, వాల్వ్ సమస్యలు, పుట్టుకతో వచ్చే గుండె లోపాల గుర్తింపు, చికిత్స యశోద ఆసుపత్రి లో అందుబాటులో ఉంది.యశోద హాస్పిటల్ లో నిత్యం హృద్రోగా నిపుణులు అందుబాటులో ఉంటారని,అనారోగ్యంతో బాధపడేవారు ఈ సేవలు ఉపయోగించువాలని కోరారు.

### ప్రజా తీర్పును గౌరవించాల్సిందే..

### - కౌన్సిలర్ల కుటుంబాలకు అండగా ఉంటాం.

### - మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్.

**రామకృష్ణాపూర్ ఫిబ్రవరి 21, సూర్య మేజర్ న్యూస్**

యుద్ధ వాతావరణంలో క్యాతనపల్లి మున్సిపాలిటీలో కౌన్సిలర్ల ప్రమాణస్వీకారం నిర్వహించం ఏమిటని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రశ్నించారు. శనివారం మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ శాసనసభ్యులు పుట్ట మధు, కోరుకంటి చందర్ తో కలిసి మాట్లాడారు. మంత్రి వివేక్ అధికారులను, పోలీసు యంత్రాంగాన్ని పార్టీ కార్యకర్తలుగా వాడుకున్నారని ఆరోపించారు. న్యాయబద్ధంగా ప్రజలు ఇచ్చిన తీర్పును అంగీకరించకుండా మంత్రి వివేక్, ఎంపీ వంశీకృష్ణలు దుష్ట సంస్కృతికి తెరలేపుతున్నారని మండిపడ్డారు. సిపిఐ బిఆర్ఎస్ పార్టీలు ఉమ్మడిగా పోటీ చేసి 14 సీట్లను కైవసం చేసుకున్నప్పటికి, అధిక మెజారిటీ ఉన్న కూటమి పార్టీలకు న్యాబద్ధంగా చైర్మెన్ పదవి ఇవ్వాల్సింది పోయి, పోలీసులు, అధికార పార్టీ నాయకులకు తలొగ్గిన ఎన్నికల అధికారులు ప్రేక్షక పాత్ర వహించడం విడ్డూరంగా ఉందన్నారు. 16వ తేదీన జరగాల్సిన మున్సిపల్ చైర్మెన్ ఎన్నికను నాటకీయ పరిణామంగా



వాయిదావేయడం, మరుసటి రోజుకూడా గెలిచిన కూటమి కౌన్సిలర్లను కార్యాలయానికి వెళ్లకుండా అడ్డుపడి, యుద్ధ వాతావరణం సృష్టించి దాడికి పాల్పడడం దురదృష్టకరమన్నారు. కూటమి పార్టీలకు ప్రాతినిథ్యం వహించిన మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ జరుగుతున్న పరిస్థితులను నిరోదించడానికి ప్రయత్నించగా అక్రమ కేసులు బనాయించారని అన్నారు. దుర్మార్గ చర్యలకు పాల్పడి దొడ్డిదారిన చైర్మెన్ పదవిని చేజిక్కించుకోవడానికి కాంగ్రెస్ ప్రభుత్వం పాల్పడడం సరికాదని, ప్రజల తీర్పును గౌరవించకపోతే రానున్న రోజుల్లో ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. గెలిచిన కౌన్సిలర్ల కుటుంబాలను కాంగ్రెస్ నాయకులు భయభ్రాంతులకు గురిచేయడం సరికాదన్నారు. కూటమి కౌన్సిలర్ల కుటుంబాలకు బిఆర్ఎస్ రాష్ట్ర అధినాయకత్వం అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో టిబిజికెఎస్ నాయకులు మిర్యాల రాజిరెడ్డి, కూటమి నాయకులు కలవేన శంకర్, రామడుగు లక్ష్మణ్, కంబగోని సుదర్శన్ గౌడ్ పాల్గొన్నారు.

# పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడమే ముఖ్యం

**- ఇందిరమ్మ ఇండ్లకు ఇసుక ఇబ్బందులు తలెత్తకుండా చూడండి**
**- రోడ్లకు మరమ్మతులకు నిధులు మంజూరు చేయిస్తా**
**- కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే రామారావు పటేల్**



**లోకేశ్వరం సూర్య మేజర్ న్యూస్**

సంక్షేమ పథకాల ద్వారా పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడమే తనకు ముఖ్యమని అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ ప్రయోజనాలు అందేలా చూస్తామని ముధోల్ శాసనసభ్యులు పవార్ రామారావు పటేల్ అన్నారు. మండల కేంద్రమైన లోకేశ్వరం రైతు వేదికలో శనివారం కల్యాణ లక్ష్మి కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా కళ్యాణ లక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకున్న పేదవారి కుటుంబాల పెళ్లిళ్లకు ఆర్థిక సాయం అందించేందుకు ఎప్పటికప్పుడు కృషి చేస్తున్నామని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఇసుక రవాణా విషయంలో లబ్ధిదారులు అవస్థలు పడాల్సి వస్తుందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లగా ఎలాంటి ఇబ్బందులు జరగకుండా చూడాలని స్థానిక ఎమ్మార్వో భోజన్నను ఆదేశించారు. మండల వ్యాప్తంగా రోడ్లన్నీ దెబ్బతిని కంకర తేలి అధ్వాన్నంగా తయారయ్యాయని, మండల ప్రయాణికులు అవస్థలు పడుతున్నారని సర్పంచుల సంఘం అధ్యక్షుడు భుజంగరావు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లాగా స్పందించిన ఆయన మరమ్మతులకు త్వరలోనే నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిటి రవీందర్,ఆత్మ చైర్మన్ గన్ను నర్సారెడ్డి, బిజెపి మండల కన్వీనర్ బొడికే సాయన్న,నాయకులు జైసాగర్ రావు, శ్రీధర్,ప్రదీప్ రావు,జీవన్,సంతోష్ పటేల్, రమణ రెడ్డి,,గన్ను వెంకట్ రెడ్డి,రాజశేఖర్,సాయందర్, ప్రవీణ్,బలరాం,ఆయా గ్రామాల సర్పంచులు, లబ్ధిదారులు, రెవెన్యూ సిబ్బంది, పాల్గొన్నారు.

## మంచిర్యాల మేయర్‌ని సన్మానించిన టిడబ్ల్యూజేఎఫ్ నాయకులు

**నస్పూర్, ఫిబ్రవరి 21, సూర్య మేజర్ న్యూస్:**

నూతనంగా ఏర్పడిన మంచిర్యాల కార్పొరేషన్ మొదటి మేయర్‌గా పదవీ



బాధ్యతలు చేపట్టబోతున్న ధర్ని మధుకర్‌ని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షులు మిట్టపెల్లి మధు,ప్రధానకార్యదర్శి గడ్డం సత్యగౌడ్‌ల ఆద్వర్యంలో శనివారం శాలువాతో సన్మానించినారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ మంచిర్యాలను అభివృద్ధిలో అగ్రగామిగా తీర్చిదిద్దుతానని, రాజకీయాలకు అతీతంగా అన్ని డివిజన్‌లను అభివృద్ధి పథంలో నిలుపుతానని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు అరిగెల ప్రవీణ్ కుమార, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## మంచినీటి సరఫరాలో అంతరాయం..

**- కొనసాగుతున్న మరమ్మతు పనులు..**
**- పురపాలక సంఘం కమిషనర్ టి రాజలింగు**

**మందమర్రి, ఫిబ్రవరి 21, సూర్య మేజర్ న్యూస్.**

పట్టణ పురపాలక సంఘం పరిధిలోని వివిధ వార్డుల్లో సరఫరా చేయనున్న తాగునీటి పైపు లైన్ల మరమ్మత్తులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టడం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ తుంగపిండి రాజలింగు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ పరిధిలోని ఊరు రామకృష్ణాపూర్, భాగ్యనగర్ కాలనీ, స్టేషన్ రోడ్, ఆర్కె-1, సుభాష్ నగర్ ప్రాంతాలలో మెజర్ పైప్‌లైన్ ల లీకేజీల కారణంగా పైప్‌లైన్ దెబ్బతిని గత 15 రోజులుగా పట్టణ ప్రజలకు మంచినీటి సరఫరాలో అంతరాయం కలిగిందన్నారు. పైపులైన్ లీకేజీ మరమ్మత్తు పనులు కొనసాగుతున్నాయని, మరో వారం రోజుల్లో లీకేజీ పనులు పూర్తవుతాయని స్పష్టం చేశారు. ఆయా వార్డ్ ప్రజలకు నీటి సరఫరాలో అంతరాయం కలుగకుండా, వాటర్ ట్యాంకర్ల ద్వారా మంచినీటి సరఫరా చేయటం జరుగుతుందనీ తెలిపారు. పైపు లైన్ల లీకేజీ పనులను మున్సిపల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం సుమతి స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. ఈ అసౌకర్యానికి పట్టణ ప్రజలు సహకరించాలని కోరారు.

## పాఠశాల విద్యార్థులకు పరీక్షా ప్యాడ్లు అందజేత

**సారంగాపూర్,ఫిబ్రవరి 21,సూర్య మేజర్ న్యూస్**

మండలంలోని బీరవెల్లి భారతి ప్రాథమిక ఉన్నత పాఠశాలలో గ్రామ సర్పంచ్ గంగవ్వ ఎల్లన్న,గురుకుల పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ లను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గురుకుల ప్రవేశ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు ఒత్తిడికి లోనవ్వకుండా,ప్రశాంతతతో పరీక్షలు రాయాలని,ప్రణాళిక బద్ధంగా చదివి సీట్లు సంపాదించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రశాంత్,పాఠశాల కరస్పాండెంట్ పోశెట్టి, ప్రిన్సిపాల్ నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.




## పత్తి సేకరణ గడువును మార్చి 20 వరకు పొడిగించాలి

**-- తహసీల్దార్‌కు బీఆర్ఎస్ వినతి**

**చింతలమానేపల్లి, ఫిబ్రవరి 21, సూర్య మేజర్ న్యూస్**

2025-26 పత్తి సీజన్‌కు సంబంధించి ప్రభుత్వ మద్దతు ధర కింద పత్తి సేకరణకు కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఫిబ్రవరి 20వ తేదీని చివరి



తేదీగా నిర్ణయించిన నేపథ్యంలో, సేకరణ గడువును మార్చి 20వ తేదీ వరకు పొడిగించాలని బీఆర్ఎస్ పార్టీ నాయకులు తహసీల్దార్ గారికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మండలంలోని రైతులు పండించిన పత్తి ఇప్పటికీ పూర్తిస్థాయిలో అమ్ముడుపోలేదని తెలిపారు. పంట చేనులో సుమారు 50 శాతం పత్తి ఇంకా తీయవలసి ఉందని చెప్పారు. కార్మికుల కొరత, వాతావరణ మార్పుల కారణంగా కోత పనులు ఆలస్యమయ్యాయని వివరించారు. పత్తి సేకరణను ఆపివేస్తే బహిరంగ మార్కెట్లో ధరలు గణనీయంగా తగ్గే అవకాశం ఉందని, దీనివల్ల రైతులకు తీవ్ర ఆర్థిక నష్టాలు వాటిల్లుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే సాగు ఖర్చులు పెరిగిన పరిస్థితుల్లో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. అందువల్ల రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పత్తి సేకరణ గడువును మార్చి 20వ తేదీ వరకు పొడిగించాలని కోరారు. లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని బిఆర్ఎస్ నాయకులు హెచ్చరించారు.

## కళ్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే పాయల్ శంకర్

**బేల, ఫిబ్రవరి 21, సూర్య మేజర్ న్యూస్ :**

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా అధికారులు కృషి చేయాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మండలానికి చెందిన లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్బంగా మాట్లాడుతూ పేద కుటుంబాల ఆడపిల్లల వివాహానికి ప్రభుత్వం అందిస్తున్న కళ్యాణ లక్ష్మి పథకం ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ వైస్ చైర్మన్ విలాస్ పటేల్, తహసీల్ధార్ రఘునాథ్ రావ్, డిప్యూటీ తహసిల్దార్ వామన్ రావ్, ఆర్ఐ సాజీద్, స్థానిక సర్పంచ్ భాగ్యలక్ష్మి దేవన్న, వివిధ గ్రామాల సర్పంచులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



**చింతలమానేపల్లిలో టేకు దుంగల**

## అక్రమ తరలింపు కలకలం

**- డిప్యూటీ రేంజ్ అధికారిపై కేసు నమోదు**
**-- దుంగల స్వాధీనం**

**చింతలమానేపల్లి, ఫిబ్రవరి 21, సూర్య మేజర్ న్యూస్**

మండలంలోని కర్జెల్లి అటవీ రేంజ్ పరిధిలోని అంబగట్ట గ్రామంలో టేకు దుంగలను అక్రమంగా తరలిస్తూ ఓ డిప్యూటీ రేంజ్ అధికారి పట్టుబడ్డ ఘటన జిల్లాలో సంచలనం సృష్టించింది. గురువారం అర్ధరాత్రి జరిగిన ఈ వ్యవహారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అటవీ సంపదను కాపాడాల్సిన అధికారులే అక్రమ కార్యకలాపాల్లో పట్టుబడటం ప్రజల్లో తీవ్ర ఆగ్రహానికి దారితీసింది. బాలాజీ అనకోడ బీట్‌లో డిప్యూటీ రేంజ్ అధికారిగా విధులు నిర్వర్తిస్తున్న హైమావతి అటవీ ప్రాంతంలో ఉన్న విలువైన టేకు దుంగలను ట్రాక్టర్‌లో తరలించేందుకు ప్రయత్నిస్తుండగా గ్రామస్తులు గమనించారు. వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించడంతో అటవీశాఖ సిబ్బంది నాటు వేసి పట్టుకున్నారు. వేల రూపాయల విలువైన టేకు దుంగలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు కర్జెల్లి అటవీ అధికారిగా వ్యవహరిస్తున్న ఎఫ్ఆర్ఓ సుభాష్ తెలిపారు. ఈ ఘటనలో హైమావతి భర్త కూడా కీలక పాత్ర పోషించినట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. నిబంధనల ప్రకారం టేకు కలపను అటవీశాఖ సిబ్బంది ఒకచోట నిల్వ చేసి, అనంతరం ప్రభుత్వ డిపోలకు తరలించాలి. అయితే వ్యక్తిగత లాభం కోసం అక్రమంగా తరలించేందుకు ప్రణాళిక రచించినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది. రనవెల్లి గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ విలాస్ వాహనంలో టేకు దుంగలు నింపుతుండగా గ్రామస్తులు ప్రశ్నించగా అసలు విషయం బయటపడినట్లు సమాచారం. ఈ విషయమై స్పందించిన ఎఫ్ఆర్ఓ సుభాష్ "సమగ్ర విచారణ చేపట్టి ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించాం. అటవీ సంపదను అక్రమంగా తరలించే వారిపై ఎంతటి వారైనా కఠిన చర్యలు తీసుకుంటాం" అని తెలిపారు. ఈ ఘటనపై జిల్లా స్థాయిలో మరింత విచారణ జరగనున్నట్లు తెలుస్తోంది.

**పది లక్షలతో గ్రామైక్య సంఘం భవన**

## నిర్మాణానికి భూమి పూజ

**సిర్పూర్ -యూ ఫిబ్రవరి 21 సూర్య మేజర్ న్యూస్**

సిర్పూర్ యు మండలం పంగిడి గ్రామంలో పదిలక్షలతో నిర్మించే గ్రామైక్య సంఘ భవన నిర్మాణానికి పంగిడి సర్పంచ్ ఆత్రం మీరా జాలీషా తో పాటు



కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆత్రం శంకర్ పూజ చేసి ప్రారంభించారు. మహిళా సంఘం అభివృద్ధికి కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. ఇందిరా క్రాంతి పథకం స్వయం సహాయక సంఘాల మహిళలకు సమావేశం నిర్వహించడానికి ఎంతో ఉపయోగపడతాది అన్నారు. మహిళలను ఆర్థికంగా ఎదుర్కోవడానికి ప్రజా పాలన ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని అన్నారు. భవన నిర్మాణ పనులు నాణ్యత పాటించాలని భవన పనులు త్వరగా పూర్తీ అయ్యేలా చూడాలని సర్పంచ్ కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి షారుక్,మహిళా సంఘం సభ్యులు,గ్రామస్తులు పాల్గొన్నారు.

**భూ భారతి రీ సర్వేతో**

## సమస్యలకు పరిష్కారం

**దస్తూరాబాద్, ఫిబ్రవరి 21 ,సూర్య మేజర్ న్యూస్:**

మండలంలోని రేవోజిపేటలో 'భూ భారతి-భూ రీ సర్వే'పై తహశీల్దార్ కనక యాదవ రావు అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ సర్వేతో భూ సమస్యలు శాశ్వతంగా పరిష్కారమవుతాయని తెలిపారు. సర్పంచ్ కోల మహేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సర్వేయర్ ప్రవీణ్ కుమార్, ఆర్ ఐ సంతోష్, ఆర్తి, గ్రామ రైతులు పాల్గొన్నారు.



# ఘనంగా మాతృభాషా దినోత్సవ వేడుకలు

**లక్షెట్టిపేట, ఫిబ్రవరి 21, సూర్య మేజర్ న్యూస్:** ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాల తెలుగు విభాగం అధ్వర్యంలో శనివారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి కళాశాల ప్రిన్సిపాల్ మహాత్మా సంతోష్ అధ్యక్షత వహించగా ఆదిలాబాద్‌కి చెందిన ప్రముఖ కవి, పరిశోధకులు డా. ఉదారి నారాయణ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.. తెలుగు విభాగం అధ్యక్షులు డా. తన్నీరు సురేష్ సమన్వయము చేశారు. ఈ సందర్భంగా ఉదారి నారాయణ మాట్లాడుతూ మాతృభాషలో,మాత్రమే సంపూర్ణ భావప్రకటనకు అవకాశం ఉందని పేర్కొన్నారు. మాతృభాషా సాహిత్యాలను అధ్యయనం చేయడం ద్వారా ఉన్నతమైన సంప్రదాయ విలువలు సంస్కృతి విశేషాలు తెలుస్తాయని పేర్కొన్నారు. తెలంగాణ భాషలోని సౌందర్యం పదాల వినియోగం ఒక చైతన్యాన్ని



కలిగి ఉంటుందని పేర్కొన్నారు. మనసు పెట్ట గలిగితే ప్రతి వస్తువు స్పందిస్తుందని మనతో మాట్లాడుతుందని ఆ స్పందన లోనే సృజన పుడుతుంది అని తెలిపారు. ప్రిన్సిపాల్ డా. మహాత్మా సంతోష్ మాట్లాడుతూ భాషల మనుగడ ప్రమాదం స్థాయిలోకి వెళ్ళకుండా కాపాడుకోవాలని పిలుపు నిచ్చారు పరభాషలు నేర్చుకున్నా మాతృభాషను మరువరాదని పేర్కొన్నారు. తెలుగు భాష వాడకం పైన ఇప్పటి తరానికి సరైన దిశా నిర్దేశం చేయవలసిన అవసరం ఉన్నదని తెలిపారు. అధ్యక్షులు డా. సురేష్ మాట్లాడుతూ తెలుగు భాషలో ఎన్నో ఉపాధి అవకాశాలు ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



మాతృభాషలో అమ్మతనం ఆత్మీయత ఉంటుందని పేర్కొన్నారు. హిందీ ఆచార్యులు డా. సంతోష్ కుమార్ మాట్లాడుతూ మాతృభాషా పరిరక్షణలో అందరం కలిసి కట్టుగా కృషి చేయాలనీ భాషల ద్వారానే సృజనాత్మక నైపుణ్యాలు పెరుగుతాయని పేర్కొన్నారు. ఉదారీ నారాయణకి కళాశాల ప్రిన్సిపాల్ స్టాఫ్ కలిసి ఘనంగా సన్మానం చేశారు. అనంతరంకార్యక్రమంలో అద్యాపకులు రాజ్ కుమార్, శంకరయ్య, ప్రేమలత, నాగేశ్వర్, చంద్రశేఖర్,శ్రీనివాస్,సంధ్యారాణి, కవిత,మల్లయ్య, స్వప్న , స్వామి , శ్రీనివాస్, ప్రశాంత్ బోధన, బోధనేతర సిబ్బంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేలుఅనిల్ జాదవ్‌ను కలిసిన బిల్లూరి,దేవుల నాయక్ తండ గ్రామస్తులు.

**నేరడిగొండ ఫిబ్రవరి 21 సూర్య మేజర్ న్యూస్.** ఇచ్చోడ మండలంలోని బిల్లూరి సోనాల మండలంలోని దేవుల నాయక్ తండ గ్రామస్తులు శనివారం ఎమ్మెల్యే అనిల్ జాదవ్ నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. రెండు గ్రామాలలో ఉన్న సమస్యలను ఎమ్మెల్యే అనిల్ జాదవ్ దృష్టికి తీసుకువెళ్లారు. సమస్యలను విన్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సానుకూలంగా స్పందించారు. నియోజకవర్గంలో ని ప్రతి గ్రామంలో సమస్యలు ఉన్న తన దృష్టికి తేవాలని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ కోరారు. ప్రజా సమస్యలే పరమావదిగా అడుగువులు వేస్తానని ఎమ్మెల్యే తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆయాగ్రాముల ప్రజలు బిఆర్ఎస్ నాయకులు ప్రజలు తదితరులు ఉన్నారు.





## గుడిలో దొంగతనం చేసిన దొంగ అరెస్ట్

**మంచిర్యాల టౌన్, ఫిబ్రవరి 21,సూర్య మేజర్ న్యూస్ :**

మంచిర్యాల పట్టణంలో శుక్రవారం రాత్రి హమాలివాడలోని పెద్దమ్మ గుడి దొంగతనం లో నిందితుడు గుమ్మడి సారయ్యని అదుపులో కి తీసుకునట్లు పట్టణ ఎస్ఐ తిరుపతి తెలిపారు. ఎస్ఐ వివరాల ప్రకారం నిందితుడు గుమ్మడి




సారయ్య అనే వ్యక్తి శుక్రవారం రాత్రి హమాలివాడలోని పెద్దమ్మ గుడి లో హుండీ పగలగొట్టి మూడు వేల రూపాయలు దొంగతనం చేసాడన్నారు .దీని గురించి విచారించగా గత సంవత్సరం నవంబర్లో జరిగిన ఎం సి సి లోని పోస్ట్ ఆఫీస్ లో రెండు మానిటర్లు, కీబోర్డ్, జనరేటర్లు, అలాగే ఈనెల 19.02.2026 న హమాలివాడలోని హనుమాన్ టెంపుల్ లో 5000 రూపాయలు దొంగతనం చేసినట్టు విచారణలో నిందితుడు నిజం ఒప్పుకున్నట్టు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి,దర్యాప్తు చేసి, నిందితుడిని కోర్టులో హాజరుపరిచామన్నారు.

## వెంకట్రావుపేట వద్ద అక్రమ పశువుల రవాణా పట్టివేత

**సిర్పూర్ (టి) సూర్య మేజర్ న్యూస్:**

కౌటల మండలం నుండి వాంకిడి వైపు అక్రమంగా తరలిస్తున్న పశువులను సిర్పూర్ టీ పోలీసులు వెంకట్రావుపేట సమీపంలో పట్టుకున్నారు. ఈ సందర్భంగా పది పశువులతో వెళ్తున్న ఒక బొలెరో వాహనాన్ని సీజ్ చేశారు. మహీంద్రా బొలెరో వాహనంలో సరైన అనుమతులు లేకుండా పశువులను తరలిస్తున్నట్లు గుర్తించిన పోలీసులు వెంటనే చర్యలు చేపట్టారు. ఈ ఘటనపై ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు.కేసులో నిందితులు షేక్ బషీర్ (వాంకిడి గోఎగావ్ గ్రామం , మహమ్మద్ రియాజ్ (షాలిబండ, హైదరాబాద్).పశువుల అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటామని, ఇటువంటి కార్యకలాపాలకు పాల్పడేవారిపై చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

## ఈ నెల 23వ తేదీ నుండి ప్రజావాణి కార్యక్రమం యధాతధం ... జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల,ఫిబ్రవరి 21, సూర్య మేజర్ న్యూస్ :**



2వ సాధారణ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో నిలిపివేసిన ప్రజావాణి కార్యక్రమం ఈ నెల 23వ తేదీ నుండి జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో యధాతధంగా నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు, దరఖాస్తుదారులు ఈ విషయాన్ని గమనించాలని, తమ సమస్యలపై దరఖాస్తులు అందజేయవచ్చని తెలిపారు.

## 10వ తరగతి లో మంచి మార్కులు సాధించాలి - జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్య

**భీమిని,ఫిబ్రవరి 21,సూర్య మేజర్ న్యూస్:** మండల కేంద్రంలోని రైతు వేదికలో మండల స్థాయి అధికారుల సంఘం ఆధ్వర్యంలో శని వారం పదవ తరగతి విద్యార్థిని, విద్యార్థులకు ప్రేరణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంకు ముఖ్య అతిథిగా జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్య హాజ రై మాట్లాడారు, విద్యార్థులు ప్రశ్నాపత్రాలను క్షుణ్ణంగా చదివి అర్థం చేసుకొని ప్రతి ప్రశ్నకి తప్పనిసరిగా జవాబులు రాయాలని విద్యార్థుల కు సూచించారు, పరీక్షలు అంటే ఎలాంటి భయము, ఆందోళన చెందవద్దని, కష్టపడి చదివి మంచి మార్కులు సాధించాలని కోరారు, భీమిని మండలంలోని విద్యార్థులు అందరూ 500 పైగా మార్కులు సాధించి జిల్లాలో భీమిని మండలానికి మంచి పేరు తీసుకురావాలని అన్నారు. ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినందుకు మండల స్థాయి అధికారులు అందరినీ మరియు సుప్రజా పీపుల్ ఫర్ పీపుల్ సొసైటీ నిర్వహకులను ఈ సందర్భంగా మనస్ఫూర్తిగా అభినందించారు,ఈ కార్యక్రమంలో సుప్రజా పీపుల్ ఫర్ పీపుల్ సొసైటీ బెల్లంపల్లి తరపున అభిలాష్, హాజరై విద్యార్థులకు స్టడీ మెటీరియల్ (ఆల్ ఇన్ వన్ బుక్స్) అందజేయడం జరిగింది. అదేవిధంగా సురేందర్ యోగా శిక్షకులు సురేందర్ విద్యార్థులకు



ఒత్తిడిని అధిగమించడానికి యోగా, ధ్యానము మరియు ప్రాణాయామం వాటి గురించి అవగాహన కల్పించారు, మండల స్థాయి అధికారుల సంఘం తరఫున విద్యార్థులకు పరీక్షలకు సంబంధించి ఎగ్జామ్ ప్యాడ్, కంపాస్ బాక్స్, 5 పెన్నులు, స్కేల్, పెన్సిల్ లు మిగతా అన్ని రకాల పరీక్ష సామాగ్రి ఉచితంగా ప్రతి విద్యార్థికి అందజేయడం జరిగింది. విద్యార్థులకు పరీక్షలకు సంబంధించి వివిధ సబ్జెక్టులపై ప్రత్యేక నిపుణుల ద్వారా అన్ని సబ్జెక్టులపై సమగ్ర అవగాహన కల్పించడం జరిగింది. ఇంకా పత్రిక విలేఖరి సంతోష్ పదవ తరగతి పరీక్షల కాలంలో పరీక్షా కేంద్రంలో విద్యార్థులకు త్రాగునీరు ఉచితంగా అందించడానికి ముందుకు రావటంతో జిల్లా విద్యాశాఖ అధికారి అభినందించారు .ఈ కార్యక్రమానికి అధ్యక్షులుగా ఎంపీడీవో బి. గంగామోహన్ వ్యవహరించ తాసిల్దార్ బికర్న దాస్ , ఎస్సై విజయ్ కుమార్ ,ఎంఈఓ వెంకటేశ్వర్లు ఏపిఎం బ్రహ్మయ్య , ఏఈ (పి ఆర్) సాయి చంద్ ఏఈ హౌసింగ్ చంద్రశేఖర్, వైద్య ఆరోగ్యశాఖ సూపరిండెంట్ జలపతి, వీగాం పాఠశాల ప్రధానోపాధ్యాయులు కుమారస్వామి కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ దివ్య ఉపాధ్యాయులు,మండలంలో నాలుగు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 123 మంది విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## రోగులకు ఏ ఇబ్బంది లేకుండా మెరుగైన వైద్య సేవలుఅందించాలి:ఎమ్మెల్యే

**కాగజ్నగర్, ఫిబ్రవరి 21, సూర్య మేజర్ న్యూస్ :**

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్నగర్ మండలంలోని భట్టుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం రోజు ఆకస్మికంగా తనిఖీ చేసిన సిర్పూర్ శాసనసభ్యులు డా. పాల్వాయి హరీష్ బాబు. ఈ సందర్భంగా అక్కడ ఉన్న మెడికల్ ఆఫీసర్ ని ఆస్పత్రి వివరాలు అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే. ఔట్ పేషంటు సేవలని విస్తరించాలని, రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆయన సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పిరిసింగుల తిరుపతి, కౌన్సిలర్ చిప్పకుర్తి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## అపరిచిత పట్ల అప్రమతంగా ఉండాలి - ఎస్సై సాయికిరణ్

**కడెం, ఫిబ్రవరి21, సూర్య మేజర్ న్యూస్:**

ప్రజలు అపరిచిత వ్యక్తుల విషయంలో జాగ్రత్తగా ఉండాలని కడెం ఎస్సై సాయికిరణ్ సూచించారు. కడెం మండలంలోని అంబర్పేట్ గ్రామపంచాయతీ ఆవరణలో అపరిచితుల గురించి సైబర్ నేరాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ బైక్ నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని గ్రామంలోకి ఎవరైనా అపరిచిత వ్యక్తులు వచ్చినట్లయితే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. రైతులు విత్తనాలు కొనేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రమేష్ తదితరులున్నారు.



# ఉపాధ్యాయులు పాఠాలు చెప్పి పరీక్ష పెడతారు






**- జీవితం పరీక్ష పెట్టీ పాఠాలు నేర్పిస్తుంది**
**- మోడల్ పాఠశాలలో ఘనంగా వీడ్కోలు పార్టీ - ప్రిన్సిపాల్ సారా తస్నీం**

**మందమర్రి, ఫిబ్రవరి 21, సూర్య మేజర్ న్యూస్.**

ఉపాధ్యాయులు పాఠాలు చెప్పి పరీక్ష పెడతారని, జీవితం పరీక్ష పెట్టీ పాఠాలు నేర్పిస్తుందని, వాటిని సహనంతో ఎదుర్కొంటే భవిష్యత్తు వెలుగులా మారుతుందని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ సారా తస్నీమ్ అన్నారు. శనివారం మందమర్రి పట్టణంలోని తెలంగాణ మోడల్ పాఠశాలలో తొమ్మిదవ తరగతి, ఇంటర్ మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థులు పదోవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు (సయొనారా) సమావేశాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాలకు, విద్యార్థులకు మధ్య ఉన్న అనుబంధానికి ఈ కార్యక్రమం నిదర్శనంగా నిలిచింది. ఈ ప్రయాణాన్ని చిరస్మరణీయంగా మార్చడంలో అమూల్యమైన కృషిచేసిన తమ ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలుపుతూ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సందడి చేస్తూ ప్రదర్శించిన చిరస్మరణీయమైన సాంస్కృతిక ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సంప్రదాయ దుస్తులు ధరించి జానపద, సినిమా పాటలకు చేసిన నృత్యాలు అందరినీ అలరించి ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ సార తస్నీమ్ మాట్లాడుతూ జీవన ప్రయాణంలో ఉపాధ్యాయులు బోధించే పాఠాలు, వారు నిర్వహించే పరీక్షలు వ్యక్తికి విద్యా పరంగా దారిదీపికగా నిలుస్తాయని, రోజువారీ జీవనంలో ఎదురయ్యే కష్టాలు, పరిస్థితులు, అనుభవాలు, ఒడిదుడుకులు జీవిత పాఠాలుగా నేర్పించి, మనిషికి నిజమైన గురువులుగా మారుతాయని, అవే పాఠాలు చెప్తూ మనల్ని మరింత బలంగా తీర్చిదిద్దుతాయంటూ ఆమే వ్యాఖ్యానించారు. పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో విద్యార్థులు ఒత్తిళ్లకు లోను కాకుండా, పట్టుదల, ఏకాగ్రతతో చదివితే సాధించలేనిది ఏదీ లేదని, మంచి ఫలితాలు సాధించి ఉన్నత స్థాయికి చేరాలని ఆకాంక్షించారు. పాఠశాలకు తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని విద్యార్థిని, విద్యార్థులకు సూచించారు. విద్యార్హతలతో పాటు అనుభవజ్ఞులైన 25 మంది ఉపాధ్యాయులు నిరంతరం విద్యార్థులకు మంచి బోధన అందిస్తున్నారని, వారి కృషితోనే ప్రైవేటు కార్పోరేట్ పాఠశాలలకు ధీటుగా మంచి ఫలితాలను సాధిస్తూ ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలు ఆదర్శంగా నిలుస్తున్నాయని, అందులో మందమర్రి పట్టణ ఆదర్శ పాఠశాల జిల్లాలోనే ఆదర్శంగా నిలిచిందని, అందుకు సహకరించిన జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారులు, ప్రతీ ఒక్క అధ్యాపకుల కృషితోనే సాధ్యమైందని హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 194 మోడల్ పాఠశాలలు ఉన్నాయని, రాష్ట్రంలోనే మొదటి స్థానంతో మన పాఠశాల పేరు మారు మ్రోగాలని, ప్రతి ఒక్క విద్యార్థి జిపిఏ సాధించి మందమర్రి మోడల్ పాఠశాల పేరును ఇతర పాఠశాలలకు ఆదర్శంగా నిలపాలని ఆకాంక్షించారు. విద్యార్థులు పాఠశాలలో చదువుకున్న సమయంలో వారు సాధించిన విజయాలు, ఎదుగుదలపై గర్విస్తూ వారి భవిష్యత్తు ప్రయత్నాలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులు మాట్లాడుతూ పాఠశాలలో వారు గడిపిన రోజులు జీవితాంతం గుర్తుండిపోతాయని, ఉపాధ్యాయుల మార్గదర్శనం వల్లే తాము ఉన్నత విద్యపై ఆత్మవిశ్వాసం పెంచుకున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, 500 మంది విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.




## గ్రామ శివారు భూములను సర్వే చేస్తాం - ఎమ్మార్వో భోజన్న

**లోకేశ్వరం,సూర్య మేజర్ న్యూస్ :** లోకేశ్వరం మండలం భామిని(కే)గ్రామంలో శనివారం సర్పంచ్ షాపురం రాణి-రాజు,అధ్యక్షతన గ్రామస్తులతో ఎమ్మార్వో భోజన్న గ్రామసభ నిర్వహించారు. గ్రామ శివారులో



గల భూములను పునః పరిశీలన చేస్తామని గ్రామస్తులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ లలిత, సర్వేయర్ మల్లికార్జున్, పంచాయతీ కార్యదర్శి విఠల్, జిపిఓ మహేందర్, ఉన్నారు.

## స్ర్కాప్ దుకాణ యజమాని అరెస్ట్ దొంగతనం చేసిన వ్యక్తి ఇద్దరి కి రిమాండ్...బోథ్ సీఐ డి. గురుస్వామి

**అదిలాబాద్: (బజరత్నూర్:) మేజ సూర్య న్యూస్ :**

దొంగతనం చేసిన వ్యక్తినీ, దొంగ వస్తువులు కొనుగోలు చేసిన సదరు వ్యక్తినీ అరెస్ట్ చేసి, శనివారం రిమాండ్ కు తరలించినట్లు బోథ్ సీఐ డీ. గురు స్వామి తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. బజార్ హత్నూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ నెల 20 న దిగ్నూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి అందే స్వామి ఇచ్చిన ఫిర్యా దు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ గురుస్వామి చెప్పారు. దిగ్నూర్ గ్రామంలో చేతి పంపు చెడిపోవ డంతో అందులోని పది పైపులను బయటకు తీసి అదే గ్రామానికి చెందిన కొరెల్లి రామకృష్ణ ఇంటి స్థలంలో ఉంచారు. ఈ నెల 16వ న ఇంట్లో ఎవరూ లేని ఒంటి యజమాని కొరెల్లి రామకృష్ణ ఆ పైపులలో ఆరు పైపు లను దొంగిలించారు. అందులో నాలుగు పైపులను ఇచ్చోడలోని స్ర్కాప్ దుకాణ యజమానికి షేక్ ముజాహిద్ కు విక్రయించినట్లు విచారణలో తేలిం దన్నారు. దొంగతనం చేసిన వస్తువులు అని తెలిసినా కొనుగోలు చేసినందుకు షేక్ ముజాహిద్‌ను, అలాగే దొంగతనం చేసిన రామకృష్ణను కూడా అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ పేర్కొన్నారు. దొంగిలించిన వస్తువుల విలువ సుమారు రూ. 3,000 వరకు ఉంటుందని తెలిపారు. దొంగతనం చేసిన వస్తువుల ను కొనుగోలు చేసే స్ర్కాప్ దుకాణ యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చ రించారు. ఆయన వెంట బజార్హత్నూర్ ఎస్సై జి సంజయ్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.




# శ్రీ సోమనాథేశ్వర దేవాలయ ప్రతిష్ఠాపన మహోత్సవం






**రామకృష్ణాపూర్ ఫిబ్రవరి 21, సూర్య మేజర్ న్యూస్**

క్యాతనపల్లి మున్సిపల్ 9 వ వార్డ్ ఆర్.ఆర్. నగర్ కాలనీ, చైతన్య కాలనీ & శ్రీ సాయి కాలనీ పరిధిలోని సోమనాథేశ్వర దేవాలయ ప్రతిష్ఠాపన మహోత్సవం బ్రహ్మశ్రీ శ్రీరాంభట్ల శేషంక్ శర్మ అద్వర్యం లో ఘనంగా నిర్వహించారు. ఉదయం 7:00 గంటలకు ఉత్సవ విగ్రహాలు, ప్రతిష్ఠ యంత్రాలు స్వామి వారి పట్టు వస్త్రాల ఊరేగింపు కార్యక్రమం శ్రీ సోమనాథేశ్వర ఆలయం వద్ద నుండి ప్రారంభించడం జరిగింది, ఉదయం 8:30 గంటలకు -- గణపతి పూజ, యాగశాల ప్రవేశం, ఇతర పూజా కార్యక్రమములు నిర్వహించి మధ్యాహ్నం 1:00 గంటలకు -- అన్న ప్రసాదం వితరణ నిర్వహించారు, అదేవిధంగా సాయంత్రం 4:00 గంటలకు -- ప్రతిష్ఠ విగ్రహాలు, ప్రతిష్ఠ యంత్రాలు, ఉత్సవ విగ్రహాల జలాధివాసము ఑ ఇతర పూజా కార్యక్రమములు నిర్వహించారు ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు సంప్రదాయ వస్త్రధారణతో అధిక సంఖ్యలో పాల్గొని ఈ పుణ్య కార్యక్రమాన్ని విజయవంతం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు మండల రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి రేగళ్ల కృష్ణమూర్తి, గౌరవ అధ్యక్షులు, భూదాత అడ్వాల మోహన్, ఉపాధ్యక్షులు ఈగ కనకయ్య, కోశాధికారి దేవరకొండ సతీష్ కుమార్, సహాయ కార్యదర్శి కంచాల తిరుపతి, అసోసియేట్ అధ్యక్షులు రంగు సురేందర్ గౌడ్, కార్యనిర్వాహణ కార్యదర్శి మచ్చ రాజేశ్వర్, ఆర్.ఆర్. నగర్ వెల్ఫేర్ అసోసియేషన్, కమిటీ సభ్యులు కాలనీవాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## 108 అంబులెన్స్ లో ఉత్తమ సేవల కు పురస్కారాలు

**మంచిర్యాల టౌన్,ఫిబ్రవరి 21,సూర్య మేజర్ న్యూస్ :**

108 అంబులెన్స్ లో ఉత్తమ సేవల అందించినందుకు గాను శనివారం పురస్కారాలు అందజేశారు. తెలంగాణ వ్యాప్తంగా 108 అంబులెన్స్ ద్వారా అత్యుత్తమ సేవలను అందించడంలో మంచిర్యాల జిల్లా ప్రథమ స్థానంలో ఉంది అని 108 సిబ్బంది తెలిపారు.మంచిర్యాల జిల్లా నుండి అత్యంత సేవలు అందించిన ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ చుంచు తిరుపతి,102 సర్వీస్ నందు అత్యుత్తమ సేవలందించిన పైలెట్ రవికుమార్ కి తెలంగాణ వ్యాప్తంగా ఉత్తమ సేవలందించినందుకు గాను మంచిర్యాల జిల్లా కలెక్టర్ దీపక్ కుమార్ చేతుల మీదుగా స్టార్ ఇ ఎం టీ పైలెట్ అవార్డులను అందజేశారు.ఈ కార్యక్రమంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ సామ్రాట్, మంచిర్యాల జిల్లా కోఆర్డినేటర్ కొండలరావు, పాలుగోన్నారు.



## అఖండ హరినామ సప్తకు ఎమ్మెల్యే అనిల్ జాదవ్ కు ఆహ్వానం

**నేరడిగొండ ఫిబ్రవరి 21 సూర్యా మేజర్ న్యూస్.**

ఇచ్చోడ మండలంలోని ధర్మపురి గ్రామంలో ఈనెల 25 వ తారీకు నుంచి జరిగే అఖండ హరినామ సప్త కార్యక్రమానికి ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ను రావాలని ధర్మపురి గ్రామస్తులు ఆహ్వాన పత్రికను అందజేశారు. దీనికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, మాజీ ఎంపీపీ ప్రీతం రెడ్డి, తానాజీ ఉపసర్పంచ్ శిరీష్ రెడ్డి, ప్రతాప్,శ్రీకాంత్ రెడ్డి,తదితరులు ఉన్నారు.



# అసాధారణ ప్రతిభతో అందరికీ ఆదర్శంగా నిలుస్తున్న దివ్యాంగులు

### - మండల విద్యా శాఖ అధికారి రాథోడ్ రమేష్




**మందమర్రి, ఫిబ్రవరి 21, సూర్య మేజర్ న్యూస్.** దివ్యాంగ పరిస్థితులు జీవితానికి అడ్డంకులుగా భావించే ఈ రోజుల్లో పట్టుదలతో ముందుకెళ్లిన కొందరు చిన్నారులు తమ అసాధారణ ప్రతిభతో అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారని మండల విద్యాశాఖ అధికారి రాథోడ్ రమేష్ అన్నారు. హైదరాబాద్ నగరంలోని గవర్నమెంట్ కాలేజ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ దోమలగూడలో ఈ నెల 17 వ తేదీన దివ్యంగా విద్యార్థులకు నిర్వహించిన రాష్ట్ర స్థాయి క్రీడ పోటీలలో విజయం సాధించిన దివ్యాంగ చిన్నారులకు మందమర్రి భవిత కేంద్రం నందు శనివారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు. రాష్ట్రస్థాయి క్యారమ్స్ లో ద్వితీయ స్థానంలో నిలిచిన మందమర్రి పట్టణానికి చెందిన ఇంటర్మీడియట్ విద్యార్థి వరున్ దేశ్ విశేష ప్రతిభను కనబరిచి పతకం సాధించాడు. అలాగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొని వరన్ దేశ్ ద్వితీయ బహుమతి సాధించింది. రన్నింగ్, క్యారం బోర్డ్, ఆటల పోటీలలో గెలుపొందిన వారికి, అలాగే క్రీడల్లో పాల్గొన్న దివ్యాంగ చిన్నారులకు మండల విద్యాశాఖ అధికారి రాథోడ్ రమేష్ విజేతలకు శుభాకాంక్షలు తెలిపి మోడల్స్, ప్రశంసా పత్రాన్ని అందించి అభినందించారు. ఈ సందర్భంగా రాథోడ్ రమేష్ మాట్లాడుతూ దివ్యాంగ చిన్నారుల విజయాలు సమాజంలోని ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదాయకమని వారి ప్రతిభకు నిదర్శనం అని స్ఫూర్తిదాయకమైన సూచనలు చేశారు. రాష్ట్రస్థాయి క్రీడా పోటీలలో జిల్లాకు చెందిన ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులు ప్రతిభ కనబరిచి పథకం సాధించడం గర్వకారణమని, శారీరక పరిమితులను అధిగమిస్తూ ధైర్యంగా పోటీలలో పాల్గొని విజయాలు సాధించడం ఆదర్శప్రాయమని అన్నారు. దివ్యంగా చిన్నారుల విజయాలు సమాజంలో సానుకూల దృక్పథాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. ఈ పిల్లల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంలో క్రీడలు కీలకపాత్ర పోషిస్తాయని అన్నారు. ఇటువంటి రాష్ట్రస్థాయి పోటీలు వారికి మరింత ప్రోత్సాహాన్ని అందిస్తాయని తెలిపారు. విద్యతో పాటు క్రీడాల్లోనూ రాణించేందుకు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని, భవిష్యత్తులో ఎలా రాణించాలో వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాధికారి రమేష్, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు ఉమాదేవి, భీం పుత్ర శ్రీనివాస్, లలిత, రవి, మంజుల, రజిత లు పాల్గొన్నారు , ప్రత్యేక ఉపాధ్యాయులైన ఐ ఇ ఆర్ పి' లు సరిత, శంకర్ లు అలాగే దివ్యాంగ విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం గౌరవ వేతనం ఇవ్వాలి

**దస్తురాబాద్, ఫిబ్రవరి21,సూర్య మేజర్ న్యూస్ :**
మండల కేంద్రంలోని రైతు వేదికలో ఎంపీడీవో అరుణకు ఉప సర్పంచులకు, వార్డు సభ్యులకు గౌరవ వేతనం ఇవ్వాలని ఉప సర్పంచులు,



వార్డు సభ్యులు వినతి పత్రాన్ని అందజేశారు ఈ సందర్భాంగా వారు మాట్లాడుతూ. ఉప సర్పంచులకు రూ. 5 వేల రూపాయాలు. వార్డు సభ్యులకు రూ.3 వేల రూపాయాలు ఇచ్చి గౌరవించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో రమేశ్ రెడ్డి, సుపర్టెంట్ గోపాల్ కిషన్, దస్తురాబాద్ మండల సర్పంచులు, తదతరులు పాల్గొన్నారు.

## గాంధీ భవన్ ముట్టడి యత్నం

### - బీజేపీ యువమోర్చా రాష్ట్ర ప్రతినిధి ఎలగతి సుచిత్ అరెస్టు

**వాంకిడి ,ఫిబ్రవరి 21,సూర్య మేజర్ న్యూస్**
హైదరాబాద్, ఫిబ్రవరి 21: కాంగ్రెస్ పార్టీ కార్యాలయం గాంధీ భవన్ ముట్టడి కార్యక్రమానికి పిలుపునిచ్చిన నేపథ్యంలో పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టి భారతీయ జనతా యువమోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి ఎలగతి సుచిత్‌ను అరెస్టు చేశారు. ఈ సందర్భంగా వాంకిడి మండల అధ్యక్షుడు వికాస్‌ను కూడా అదుపులోకి తీసుకున్నారు.హైదరాబాద్‌లో నిర్వహించిన 'ఇండియా ఏఐ ఎక్స్‌పో'లో కాంగ్రెస్ కార్యకర్తలు భారత మండపంపై దాడి చేసి



ప్రధానమంత్రి నరేంద్ర మోడీను అవమానించారని ఆరోపిస్తూ బీజేపీ యువమోర్చా తెలంగాణ రాష్ట్ర శాఖ గాంధీ భవన్ ముట్టడికి పిలుపునిచ్చింది. దీనికి అనుగుణంగా శనివారం ఉదయం నుంచే నేతలు, కార్యకర్తలు కార్యాలయానికి తరలివెళ్లేందుకు సిద్ధమయ్యారు.అయితే శాంతిభద్రతల దృష్ట్యా పోలీసులు ముందస్తుగా చర్యలు తీసుకుని ఎలగతి సుచిత్ సహా పలువురు నాయకులను వారి నివాసాల వద్దనే అదుపులోకి తీసుకున్నారు. వాంకిడి మండల అధ్యక్షుడు వికాస్‌ను కూడా పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు.ఈ సందర్భంగా బీజేపీ నాయకులు పోలీసుల చర్యలను ఖండిస్తూ, తమ నిరసన కార్యక్రమాన్ని అడ్డుకోవడం ప్రజాస్వామ్య హక్కుల హననమని విమర్శించారు. కాంగ్రెస్ కార్యకర్తల దాడిపై తక్షణ చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. పోలీసులు పరిస్థితిని అదుపులో ఉంచేందుకు నగరంలోని పలు ప్రాంతాల్లో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సమాచారం.

### బీసీ జేఏసీకి శివారం గ్రామ నివాసి

## బీరువా అందజేత



**జైపూర్ ఫిబ్రవరి 21 సూర్య మేజర్ న్యూస్**
జైపూర్ మండలంలోని బీసీ జేఏసీ కార్యాలయానికి శివారం గ్రామానికి చెందిన తిప్పని రాజ గౌడ్ ఒక బీరువాను అందజేశారు. కార్యాలయ వినియోగానికి అవసరమైన సామగ్రి లేకపోవడంతో తన వంతు సహాయంగా ఈ బీరువాను ఇవ్వడం జరిగింది.ఈ సందర్భంగా మండల బీసీ జేఏసీ నాయకులు రాజ గౌడ్‌ను అభినందిస్తూ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మండల కోఆర్డినేటర్ మార్తా మారుతి, కన్వీనర్ వేముల మల్లేష్, మాజీ సర్పంచ్ ఆవిడ గణేష్, మాజీ ఎంపిటిసి బోయిని సంపత్ తదితరులు పాల్గొన్నారు.సంఘ కార్యకలాపాల నిర్వహణకు ప్రజల సహకారం ఎంతో అవసరమని నాయకులు పేర్కొన్నారు. సమాజ అభివృద్ధికి ముందుకు వచ్చే దాతలకు ఎల్లప్పుడూ స్వాగతం ఉంటుందని తెలిపారు.

## శెట్టి హడపనుర్ గ్రామ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి అని చైర్మన్ విశ్వనాథ రావుకి వినతి పత్రం

**సిర్పూర్ యూ ఫిబ్రవరి 21 సూర్య మేజర్ న్యూస్**
సిర్పూర్ యు మండల శెట్టి హడపనుర్ గ్రామ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని శెట్టి హడపనుర్ పంచాయతీ సర్పంచ్ ఆత్రం విజయ లక్ష్మి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడ్మెత విశ్వనాథ్ రావు కలసి వినతి పత్రం అందజేశారు.గ్రామాల్లో నెలకొన్న ప్రధాన సమస్యలను వారి దృష్టికి తీసుకుని వెళ్లారు.గ్రామ సమావేశ భవనం నిర్మాణం గురించి, తాగునీళ్లు, బావి బోరు మంజూరు కొరకు కృషి చేయాలని కోరారు. చైర్మన్ విశ్వనాథరావు సానుకూలంగా స్పందించి గ్రామాల్లో ప్రధానంగా నెలకొన్న సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ చీరలే లక్ష్మణ్,సర్పంచ్ మెస్రం భూపతి,చందన్ షావ్, కొట్నక బాపూజీ మడవి లక్ష్మణ్, పెందూర్ గణపతి,డైరెక్టర్ మండాడి లింగు,తదితరులు పాల్గొన్నారు.



## సామాజిక మాధ్యమాలలో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయకూడదు .. మంచిర్యాల డిసిపి ఎగ్గడి భాస్కర్

**రామకృష్ణాపూర్ ఫిబ్రవరి 21, సూర్య మేజర్ న్యూస్**



చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని మంచిర్యాల డిసిపి ఎగ్గడి భాస్కర్ హెచ్చరించారు. స్థానిక పోలీస్ స్టేషన్లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల క్యాతనపల్లి మున్సిపాలిటీకి సంబంధించిన చైర్మెన్, వైస్ చైర్మెన్ ఎన్నిక విషయంలో జరిగిన పరిణామాలను దృష్టిలో పెట్టుకొని సామాజిక మాధ్యమాలలో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయకూడదని సూచించారు. రాజకీయ పార్టీలకు అనుకూలంగా పోలీస్ యంత్రాంగం పనిచేయదని చెప్పారు. రాజకీయ పరిణామాలలో పట్టణంలో ఎలాంటి సంఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకోవలని స్థానిక ఎస్సై శ్రీధర్కు సూచించారు.ఈ సమావేశంలో బెల్లంపల్లి ఏసిపి రవికుమార్, మందమర్రి సిఐ పర్స రమేష్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## త్వరగా కోలుకోవాలని ఆలయంలో కాంగ్రెస్ నాయకుల పూజలు

**మందమర్రి, ఫిబ్రవరి 21, సూర్య మేజర్ న్యూస్.** క్యాతనపల్లి మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల నేపథ్యంలో బిఆర్ఎస్ నాయకులు జరిపిన రాళ్ల దాడిలో తీవ్రంగా గాయపడి హాస్పిటల్లో చికిత్స పొందుతున్న కానిస్టేబుల్ (గన్ మెన్) రాకేష్, కాంగ్రెస్ కార్యకర్తలు జావీద్ ఖాన్,తోకల సురేష్‌లు త్వరగా కోలుకోవాలని స్థానిక పాలచెట్టు ప్రాంతంలోని పంచముఖి హనుమాన్ ఆలయంలో శనివారం యూత్ కాంగ్రెస్ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఇటువంటి సంఘటనను యూత్ కాంగ్రెస్ తీవ్రంగా ఖండిస్తోందని అన్నారు. హింసాత్మక ఘటనలు భవిష్యత్తులో కూడా జరగకుండా చూసుకునే బాధ్యత సమాజంలో ఎంతైనా ఉందని అన్నారు. రాళ్లదాడిలో గాయపడ్డ వారు త్వరగా కోలుకోవాలని భగవంతుణ్ణి కోరారు.ఈ కార్యక్రమంలో మండల యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు మాయ తిరుపతి, మాజీ యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ వడ్లూరి సునీల్ కుమార్, పట్టణ యూత్ కాంగ్రెస్ నాయకులు రాయబారపు కిరణ్, మూడరపు శేఖర్, గజ్జల నరేష్, సురేందర్, చోటు, గణేష్, రాజేష్, మెరుగు సతీష్, రేగుంట కిరణ్, సాయికిరణ్, ప్రదీప్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



### స్థానిక సంస్థల ఎన్నికల్లో సంయుక్తంగా పోటీ

## తెలంగాణ జాగృతి

**జైపూర్ ఫిబ్రవరి 21 సూర్య మేజర్ న్యూస్**
మంచిర్యాల జిల్లాలో తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో ముఖ్య నేతల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రూప్ సింగ్ ముఖ్య అతిథిగా హాజరై కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు.సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాబోయే జెడ్పిటిసి, ఎంపిటిసి ఎన్నికల్లో తెలంగాణ జాగృతి మరియు ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ కలిసి రాష్ట్రవ్యాప్తంగా అభ్యర్థులను నిలబెట్టనున్నట్లు ప్రకటించారు. గ్రామీణ స్థాయిలో ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధి లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు.ఈ సందర్భంగా నాయకులు ఎన్నికల సన్నాహకాలు, బూత్ స్థాయి బలోపేతంపై చర్చించారు. సమావేశంలో హెచ్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షులు రియాజ్ అహ్మద్, నిట్టూరి రాజు, పూదరి చంద్రమోహన్, తిప్పారపు సారయ్య, బొగ్గుల సాయి తదితరులు పాల్గొన్నారు.



## ఎమ్మెల్యేపై దాడికి యత్నించిన వారిని అరెస్టు చేయాలి
### -- ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్

**ఆదిలాబాద్ టౌన్, ఫిబ్రవరి 21: మేజర్ సూర్య న్యూస్:** కామారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేపై దాడికి యత్నించిన కాంగ్రెస్ గుండాలను వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా దర్యాప్తు చేయాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే



క్యాంప్ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికైన ప్రజాప్రతినిధులపై దాడులు చేయడం చట్ట విరుద్ధమని తీవ్రంగా ఖండించారు. రాష్ట్రంలో బీజేపీ నాయకులపై దాడులు ఒక ఫ్యాషన్‌లా మారిపోవడం అత్యంత ఆందోళనకరమని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో విభిన్న అభిప్రాయాలు సహజమైనవే కానీ హింసాత్మక చర్యలకు తావులేదని స్పష్టం చేశారు. హిందువులు పూజలు చేయడం, భక్తి గీతాలు వినిపించడం కూడా తప్పుగా చూపించే పరిస్థితులు నెలకొనడం దురదృష్టకరమని అన్నారు. ప్రతి పౌరుడికి తమ మతాచారాలను స్వేచ్ఛగా ఆచరించే హక్కు రాజ్యాంగం కల్పించిందని గుర్తుచేశారు. రాష్ట్ర పోలీసులు చట్టం, శాంతి భద్రతలను కాపాడే బాధ్యతను నిష్పాక్షికంగా నిర్వర్తించాలని కోరారు. భారతీయ జనతా పార్టీ కార్యకర్తల సహనాన్ని పరీక్షించవద్దని, కాంగ్రెస్ పార్టీ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వేదవ్యాస్, కృష్ణ యాదవ్, సతీష్, పోసాలు, గంట జీవన్, భీమచంద్ రెడ్డి, రాము, సాయి తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ రవాణాకు.. అధికారుల అండదండలు
### - జోరుగా సాగుతున్న అంతరాష్ట్ర అక్రమ రవాణాలు

**సిర్పూర్ (టి) సూర్య మేజర్ న్యూస్:** అక్రమ రవాణాను అడ్డుకోవాల్సిన అధికారులే చర్యలు చేపట్టకపోవడం వల్ల అంతరాష్ట్ర అక్రమ రవాణా జోరుగా సాగుతుంది. మండల కేంద్రంలోని వెంకటరావుపేట సమీపంలో బ్రిడ్జి పై



నుండి రాత్రి పగలు జోరుగా ఎలాంటి అనుమతులు లేకుండా భారీ వాహనాలు, అక్రమ రవాణాలు జోరుగా సాగుతున్నాయన్న విషయం సంబంధిత రెవెన్యూ, పోలీస్ శాఖ అధికారులకు తెలిసినప్పటికీ వారు పట్టించుకోకపోవడంతో అక్రమ రవాణాలు జోరుగా కొనసాగుతున్నాయి. నిబంధన ప్రకారం వాంకిడి చెక్పోస్ట్ గుండా భారీ వాహనాలు , వాహనానికి సంబంధించిన టాక్స్ చెల్లించి రవాణా చేయవలసిందిగా దొడ్డి దారిన అక్రమ రవాణా చేపడుతూ ప్రభుత్వ నిధులకు గండి కొడుతున్నారు, ఇదే అదునుగా కొందరు అక్రమార్కులు నిషేధిత గుట్కా ,మద్యం ,బెల్లం, తదితర వస్తువులు పట్టపగలు రవాణా చేస్తున్నారు. సందులో సడే మియా లాగా పశువుల అక్రమ రవాణా సైతం జోరుగా కొనసాగుతున్నట్టు సమాచారం. గతంలో వెంకటరావుపేట్ సమీపంలో రెవెన్యూ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో చెక్పోస్ట్ ఏర్పాటు చేయగా కొన్ని రోజుల నుండి చెక్పోస్ట్ ను తీసివేయడంతో భారీ వాహనాలు రాత్రింబవళ్లు జోరుగా అక్రమ రహదారి గుండా ప్రయాణిస్తూ మండల ప్రజలకు తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి భారీ వాహనాల వల్ల రోడ్లు చెడిపోవడంతో పాటు దుమ్ము వల్ల వాహనదారులు మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదు ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి అక్రమ రవాణాలను అరికట్టి ప్రభుత్వ ఆదాయానికి తోడ్పడుతూ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.



## పట్టణాభివృద్ధియే లక్ష్యం
### -- చైర్మన్ పీఠాన్ని బాధ్యతగా భావిస్తూ ప్రజలకు సేవ చేస్తా
### -- మున్సిపల్ చైర్ పర్సన్గా బాధ్యతలు సీవకరించిన బండారి అనూష

**ఆదిలాబాద్ టౌన్, ఫిబ్రవరి 21: మేజర్ సూర్య న్యూస్:** ఆదిలాబాద్



పట్టణాభివృద్ధియే లక్ష్యంగా ముందుకు సాగుతానని, మున్సిపల్ చైర్మన్ పీఠాన్ని పదవిలా కాకుండా బాధ్యతగా భావిస్తూ ప్రజలకు సేవ చేస్తానని మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష అన్నారు. శనివారం మున్సిపల్ పదవీ బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ చాంబర్లో వేదపండితులతో పూజలు, ముస్లీం మత పెద్దలతో ప్రార్ధనాలను చేసి బాధ్యతలను చేపట్టారు. అనంతరం చైర్ పర్సన్ మాట్లాడుతూ పట్టణ ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా వారి సమస్యల పరిష్కరానికి కృషి చేస్తానని అన్నారు. అన్ని వార్డుల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కరామే లక్ష్యంగా ముందుకు సాగుతానన్నారు. మేజర్ సమస్యలు ఉంటే కౌన్సిల్లో చర్చించి సభ్యుల ఆమోదం అనంతరం ప్రధాన్య క్రమంలో పూర్తి చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్మన్ మహ్మద్ రోహిత్, ఎంఐఎం కౌన్సిలర్ నజీర్ అహ్మద్, కాంగ్రెస్ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి, ఆత్మ ఆదిలాబాద్ డివిజన్ చైర్మన్ గిమ్మ సంతోష్, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, ఆయా సంఘాల నాయకులు చైర్ పర్సన్ను సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ డీసీసీబీ చైర్మన్అడ్డి భోజారెడ్డి, మాజీ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలి
### -- మున్సిపల్ చైర్ పర్సన్ దంపతులకు బోరంచు సన్మానం

**ఆదిలాబాద్ టౌన్, ఫిబ్రవరి 21: మేజర్ సూర్య న్యూస్:** పట్టణ ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తూ వారి నమ్మకాన్ని



నిలబెట్టుకోవాలని తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి అన్నారు. ఇటీవల ఆదిలాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ గా నియమితులైన బండారి అనూష సతీష్ ప్రమాణ స్వీకార కార్యక్రమం శనివారం మున్సిపల్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై చైర్మన్ దంపతులతో పాటు నూతనంగా ఎన్నికైన కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లను సన్మానించారు. నూతన చైర్ పర్సన్ తో పాటు కౌన్సిలర్లు పట్టణాభివృద్ధికి కృషి చేస్తూ స్మార్ట్ సిటీ కోసం పాటుపడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మావల సర్పంచ్ ధర్మపురి చంద్రశేఖర్, రేండ్ల రాజన్న, యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వేముల నాగరాజు, అలీం, సమ్ము, రహీం తదితరులు పాల్గొన్నారు.

## పెర్సపెన్ పెద్ద దేవుడి మందిరానికి భూమి పూజ

**సిరికొండ, ఫిబ్రవరి 21 సూర్య మేజర్ న్యూస్**

సిరికొండ మండలంలోని కోసు పటేల్ గూడలో నగేర పెందుర్ వంశీయుల ఆధ్వర్యంలో పెర్సపెన్ పెద్ద దేవుడు మందిరం నిర్మాణానికి శనివారం భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రధాన అతిథిగా కొరేంగ యశ్వంత్



రావు మహారాజ్ హాజరయ్యారు. భవిష్యత్తులో ఈ మందిరం ప్రాంతీయ భక్తులకు ఆధ్యాత్మిక కేంద్రంగా మారుతుందని నగేర పేందూర్ వంశీయులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పటేల్ కుమరం రావుజీ, పటేల్ కుమరం యాదవ్ రావు, దేవరి కుమరం జంగుబాపు, మహాజన్ కోరేంగ వాగు, కర్భరి కుమరం కోసే రావు, పెన్ కటోడ పెందుర్ ఆనంద్ రావు, కటోడల్ పెందుర్ జంగు కటోడల్, పెందుర్ బందు,పెందుర్ భీంరావ్, జంగు , సూర్య బాన్, సాగర్ ,గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ పనులు చేపట్టిన
### ఉప సర్పంచ్ పేందోర్ రామారావు

**సిర్పూర్ యూ ఫిబ్రవరి 21 సూర్య మేజర్ న్యూస్**

సిర్పూర్ మండలంలోని స్థానిక బజార్ గూడా లో వార్డ్ సభ్యులు కుమార దేవిదాష్ తో కలిసి ఉపసర్పంచ్ పేందోర్ రామారావు డ్రైనేజీలో



పేరుకుపోయిన చెత్త, మట్టి తొలగించే పనులు చేపట్టారు.వర్ష కాలంలో డ్రైనేజీలో వర్షపు నీరు ఆగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.డ్రైనేజీలో నీరు నిలువ ఉంటే దోమలు వ్యాప్తి చెంది అవకాశం ఉందని స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. గ్రామాల్లో ఎలాంటి సమస్య ఉన్న తమ దృష్టికి తీసుకుని రావాలని కోరారు.

## ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లో తీసుకొని వెళ్ళాలి: ఆత్రం శంకర్

**సిర్పూర్ యూ ఫిబ్రవరి 21 సూర్య మేజర్ న్యూస్**

సిర్పూర్ యు లో ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లో తీసుకొని వెళ్ళాలి కాంగ్రెస్ మండల అధ్యక్షులు ఆత్రం శంకర్ సర్పంచ్లను కోరారు.శనివారం



సర్పంచ్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న అన్ని సంక్షేమ పథకాలు ప్రజల్లో తీసుకొని వెళ్ళాలని సూచించారు. గ్రామాల్లో నెలకొని ఉన్న ప్రధాన సమస్యలను పరిష్కారానికి కృషి చేయాలని పేర్కొన్నారు.వేసవి కాలం సమీపిస్తున్న సందర్భంగా నీటి ఎద్దడి నివారణ చర్యలు చేపట్టాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు పేందర్ గణపత్, సేడమకి జానే రావు, లక్ష్మణ్, బాపూజీ,అంబరావు, బీర్ షాప్,గణపత్, తదితరులు పాల్గొన్నారు.

## నేడు బాధ్యతల స్వీకరణ

**నస్పూర్, ఫిబ్రవరి 21, సూర్య మేజర్ న్యూస్:**మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, జిల్లా మాజీ డిసిసి అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ఆధ్వర్యంలో మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ తొలి మేయర్ గా ధర్ని మధుకర్ ఆదివారం ఉదయం 10 గంటలకు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో పదవి బాధ్యతలు స్వీకరిస్తున్నారు. ఈ కార్యక్రమంలో అన్ని డివిజన్లో కార్పొరేటర్లు, పలువురు నాయకులు తదితరులు పాల్గొంటారు.

## కాంగ్రెస్ పార్టీ లో చేరికలు
### కండువాలు కప్పి పార్టీలోకి స్వాగతించిన కంది శ్రీనివాస రెడ్డి

**ఆదిలాబాద్, ఫిబ్రవరి 21, సూర్య మేజర్ న్యూస్ :**

యంపీటీసీ ,జడ్పీటీసి ఎన్నికలలో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని బేల మండల కాంగ్రెస్ నాయకులకు ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని క్యాంపు కార్యాలయం ప్రజాసేవాభవన్ లో జరిగిన చేరికల కార్య క్రమానికి ఆయన హాజరయ్యారు. బేల మండలం నుండి బేల మాజీ జడ్పీటీసీ రాందాస్ నాక్లే ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ లో చేరారు. వారందరికి కండువాలు కప్పి కంది శ్రీనివాస రెడ్డి పార్టీలోకి స్వాగతించారు. కలిసి కట్టుగా పనిచేసి బేలలో పార్టీని బలోపేతం చేద్దామన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ సంతోష్ రావు , జైనథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లూరి అశోక్ రెడ్డి,వైస్ చైర్మన్ విలాస్ పటేల్ సవాపురే,మాజీ జడ్పీటీసీ రాందాస్ నాక్లే,జైనథ్ ఆలయ కమిటీ చైర్మన్ అడ్డి రుకేష్ రెడ్డి,అల్చెట్టి నాగన్న, శ్రీలేఖ, బేల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఫైజుల్లా ఖాన్ ,సుధాం రెడ్డి, నగేష్ రెడ్డి, రూపేష్ రెడ్డి, బండి సుదర్శన్, మడావి చంద్రకాంత్ తదితరులు పాల్గొన్నారు.

